హాస్యకథ

# పులికి పిలక లేదు

చిలుకూరి దేవపుత్ర

సింహాచలం మంచివాడూ, నికార్సయిన మనిషీనూ! సింహాచలానికి నీతి ఆరోప్రాణం, నిజాయితీ ఏడోప్రాణం, నిక్కచ్చితనం ఎనిమిదో ప్రాణం.... ఇట్లా అతనికి ఎన్ని ప్రాణాలుంటాయో చెప్పకుంటూ పోవడం అలివిగాని పనే - ఎవరికయినా.

ఒక్కమాటలో చెప్పాలంటే సింహాచలం చాలా ఖచ్చితమైన మనిషని చెప్పక తప్పదు.

తను ఎంత నీతీ, నిజాయితీలతో ఉంటాడో, ఎదుటివారు కూడా అంతే నీతీ, నిజాయితీలతో ఉండాలని కోరుకుంటూనే ఉంటాడు.

సింహాచలం సన్నగా, పొడుగ్గా, ఎర్రగా ఉంటాడు. వయసు నలభైఆరు. నీటిపారుదల శాఖలో గుమాస్తాగా ఉద్యోగం.

ఆవేళ సింహాచలం సైకిలును యాంత్రికంగా ఎడాపెడా తొక్కేస్తూ ఉన్నాడు. అంతకుముందే కరెంటు విషయమై విద్యుత్తు శాఖాధికారులతో గొడవ పడినందువల్ల, అతని మన సులో ఆ గొడవే గింగిర్లు కొడుతూ వుంది.

"ఎక్కడ చూసినా అవినీతే తాండవిస్తా ఉంది... అరే! కరెంటు మీటరు మార్చమంటే కూడా వినిపించుకోరూ.... వీళ్లకి 'మామూలు' ఇయ్యాల్లేమో! ఎవరడిగినా సరే, ఇయ్యను గాక ఇయ్యనంతే - ఎందుకియ్యాల్ల? నాకిచ్చినట్లే గవర్నమెంటు వీళ్లకీ యిస్తున్నారు గదా - జీతాలు. ఆ మాట అన్నందుకే గదా ఆ నాకొడుకులకి మంది కొట్లాటకి దిగినారు. ఈ వెదవ నాయాండ్లని నిలువునా నరికితే గాని పాపం పోదు! థూ!" అంటూ స్వగతంగా అనుకుంటూనే రోడ్డుమీదకి తుపుక్కున కసిగా ఉమ్మేశాడు. ఉన్నట్టుండి రక్తప్రసరణ పెరిగింది సింహా చలానికి. అప్పుడెవరైనా అతన్ని ఆపి రక్తపోటు కొలిస్తే, దాని తాలూకు పరికరం పగిలిపోయే ప్రమాదం ఉంది.

"ఏమప్పా! యాడో జూసుకుంటా సైకిలు తొక్కేదేనో కొంచెముంటే నా కాలి మిందెల్లి పోతా ఉండె!" అంటున్నాడు ఓ పల్లెటూరి మనిషి.

తనదే తప్పు ఏదో ఆలోచనలో రోడ్డుకు కుడివైపున పోవడం. అయినా, తన మనసు అతని మాటలకి కొంచెం నొచ్చుకుంది.

"సారీ, పొరపాటయిందప్పా!" అని ఒక్క మాట అనేసి రోడ్డుకు ఎడం వైపుకి మళ్లించాడు సైకిల్ని.

అప్పటికి 4 గంటలవుతోంది...

తీరా ఇంటికొచ్చేసరికి తాళం వేసి ఉంది. ఇంటికి తాళం వేసేంత అవసరం ఏం వచ్చిందా... అని అనుకుంటూ ఉండగానే పక్కింటి అమ్మాయి నవ్వు మొహంతో - "అంకుల్! ఆంటీవాళ్లు మ్యాట్నీకి పోయినారు, ఇదిగో తాళం చెవి. మీకిమ్మనీ...." అంటూ తాళం చెవిని అందించింది. అతను మౌనంగానే అందుకున్నాడు. ఆ అమ్మాయి నవ్వుతూ మాట్లాడితే, కనీసం సభ్యత కోసమైనా తను నవ్వలేదు. ఆ పిల్ల ఏమనుకుందో ఏమో!" అనుకుంటూనే తలుపు తీశాడు.

మొహం అంతా చమటలు పట్టి ఉన్నాయి. వెంటనే బట్టలు మార్చుకునీ, లుంగీ బనియనులతో తయారైనాడు. బాత్రూమ్ కెళ్ళి మొహం కడుక్కుని వచ్చాడు. కొంచెం రిలీఫ్‌గా ఫీలయి కుర్చీలో కూలబడ్డాడు. సిగరెట్టు అంటించుకుని పొగవదుల్తూ ఉంటే ఎదురుగా గోడకున్న కరెంటు మీటరు కనబడింది. అసహనంగా మీటరు వైపు చూశాడు. దానివల్లనే తనకు గత ఆరు నెలలుగా మనశ్శాంతి లేకుండా పోయింది. పగలగొట్టేద్దామా అన్నంత కోపంగా ఉంది - దానిమీద.

సింహాచలం వాళ్లు ఆ ఇంట్లోకి మారిన కొత్తలో చక్కటి ఇల్లు దొరికినందుకు ఎంతో సంతోషించారు. రెండు పెద్ద గదులూ, సుమారు పాటి వంటిల్లూ, ప్రతి గదికీ ఎక్కడ చూసినా అరలు ఉండటం, బాత్రూం, లావెట్రీలు ఇంటికి కాస్త దూరంగా ఉండటం... దగ్గర్లోనే కొళాయీ, ఇంటిముందే ఉప్పు నీళ్ల బోరూ ఉండటంతో ఎక్కడ లేని ఆనందం కలిగింది ఇంటిల్లిపాదికీ...

వారం రోజుల తర్వాత ఓ మధ్యాహ్నం వేళ కరెంటు బిల్లు వచ్చింది. అందులో రెండు నెలలకు గానూ ఎనిమిది వందల రూపాయలు అని ఉంది. అంతకు ముందు ఆ ఇంట్లో ఉన్నవాళ్లు మిక్సీ, హీటరూ, ఫ్రిజ్ వంటివి వాడే వాళ్లు కాదనీ, ఇంటికి ఉన్న మీటరు లోపం వల్లే అంతంత కరెంటు బిల్లు వస్తోందనీ పక్కింటి వాళ్లు చెప్పారు. ఆ రోజు నించీ అతను ఉదయం లేస్తూనే మొదట చేసే పని మీటరు చూడ్డం. అట్లా మూడు రోజులు దాన్ని గమనించాడు. రోజుకు పన్నెండు యూనిట్లు కాలుతోన్నట్టు చూపుతోంది మీటరు. అంతే భయం వేసి ఆ రోజు నుంచీ ఆ మీటరు వేపు కన్నెత్తి చూడడమే మానుకున్నాడు. ఆలస్యం చేయకుండా ఆ మీటర్ని వెంటనే మార్పించేయాలనుకు న్నాడు సింహాచలం. ఈ విషయం మీద మాట్లాడుదామా అంటే ఇల్లుగలవాళ్లు ఎక్కడో బళ్లార్లో ఉన్నారు. అంచేత వెంటనే విషయాన్నంతా వివరిస్తూ ఉత్తరం రాశాడు వాళ్లకి. నాలుగు రోజుల తర్వాత ఇంటి యజమాని నించీ ఉత్తరం వచ్చింది. అందులో ఇలా ఉంది - 'మీరు మీటరు మార్పించమని ఉత్తరం రాశారు. నాకు అంత తీరిక లేదు. ఈ ఉత్తరంతో పాటూ కరెంటు ఆఫీసు వాళ్లకి అర్జీ పంపుతున్నాను దాన్ని ఆఫీసులో ఇచ్చేసి మీటర్ని మార్పించేసుకోండి. ఇకపోతే, మీరు మొత్తం కరెంటు బిల్లు (ఎనిమిది వందలూ) కట్టేస్తే నాకేమీ అభ్యంతరం లేదు. అయితే, మీరు రాసినట్టు ఎక్కువ మొత్తాన్ని బాడుగలో పట్టుకోకండి. నెలకి ఏభై రూపాయలు మాత్రం పట్టుకోవాల్సి ఉంటుంది. అట్లా కాని పక్షంలో మీరు మరో ఇల్లు చూసుకోండి. " ఉత్తరమంతా చదివి ఒక నిట్టూర్పు వదిలాడు సింహాచలం.




ఉత్తరంతో పాటూ వచ్చిన అర్జీని తీసుకుని కరెంటు ఆఫీసులో ఇచ్చిరావడంతో సమస్యతీరిందనుకున్నాడు సింహాచలం. మరుసటిరోజే కొత్తమీటరు బిగించి పోతారని ఆశించాడుకూడా.

ఓ సాయంత్రం సింహాచలం ఇంటికొస్తూనే ముంగిట్లోనే తల్లి హరికెన్ లాంతరు శుభ్రం చేస్తూ కనబడింది. ఎప్పుడో ముప్పయేళ్ల కిందటి సాయంత్రాలు జ్ఞాపకం వచ్చాయి సింహాచలానికి. అప్పటికి తాము ఉండే ఇళ్లల్లో కరెంటు సదుపాయం ఉండేది కాదు. సాయంత్రం అవుతున్నట్లే లాంతరుకున్న చిమ్నీని నీటుగా శుభ్రం చేసి ఉంచకపోతే నాన్న కోపానికి గురికావాల్సి వచ్చేది. తనకు ఇష్టం లేకున్నా లాంతర్ని శుభ్రం చేయాల్సిందే. లాంతరు వెలుతుర్లోనే రాత్రి 12 గంటల దాకా చదువుకునేవాడు తను.

"కరెంటోళ్లు మధ్యాన్నం వచ్చి, బిల్లు కట్టలేదని ఫ్యూజ్ పీక్కుపోయినారురా!" అంది అమ్మ చిమ్నీని తెల్లటి బట్టతో శుభ్రపరుస్తూ.

సింహాచలం మరేం మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాడు. మసగ్గా ఉన్న వెలుతుర్లోనే బట్టలు మార్చుకుని గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తూ ఉన్నాడు.

కాఫీ అందిస్తూ భాగ్యమ్మ కూడా అమ్మ చెప్పిన మాటే చెప్పింది. "ఊ" అనేసి - కాఫీ తాగడంలో ఉండిపోయాడు సింహాచలం.

అతని మనసు బాధతో నిండిపోయి ఉంది. ఏదేమైనా సరే మరసటిరోజు కరెంటు బిల్లు చెల్లించేసి ఫ్యూజ్ వేయించేయాల

నుకున్నాడు.

అమ్మ లాంతరు వెలిగించింది. గుడ్డి వెలుతురు అలుము కుంది గదిలో.

"నాన్నా! మన మిద్దెమీద నించే కదా, కరెంటు వైర్లు పోయ్యేది, డైరెక్టుగా వైర్లనించీ కరెంటు తీసుకుందామా?" అన్నాడు అతని కొడుకు సుధాకర్.

"అవునండీ! ఈ ఒక్కరోజూ అట్లజేస్తే..." అంది భాగ్యమ్మ.

"ఛ నోర్మూయండీ... బాగున్నారిద్దరూ... ఎందుకిట్లా పాడు ఆలోచనలు వస్తాయి మీకు... కరెంటు దొంగిలించడం ఎంతనేరమో తెలుసా?" అంటూ 'ఛయ్' మంటూ లేచాడు సింహాచలం.

"అబ్బాబ్బా! అన్నీ నీకు నేరాలే- పోనీ పక్కింటి నించీ కరెంటు తీసుకుందామా - అనసూయమ్మగారిని అడుగుతాను" అంది భాగ్యమ్మ. భర్త కళ్లలోకి భయంభయంగా చూస్తూ.

"ఏంది భాగ్యా! ఒక్కరోజు కరెంటు లేకపోతే ఛస్తామా! పక్క ఇళ్లల్లోంచి కరెంటు తీసుకోవడంకూడా నేరమే తెలుసా?" అన్నాడు సింహాచలం అసహనంగా.

"ఎట్లనేరమౌతుందండీ! అంతగా అయితే మనం కరెంటు ఎంత కాల్చినామో లెక్కేసి వాళ్లకి డబ్బిద్దాంలే!" అమాయకంగా చూస్తూ అంది భాగ్యమ్మ.

"వాళ్లకి డబ్బిస్తే అదినేరం కాకుండా పోతుందా? మనకి గవర్నమెంటు ఇచ్చిన కనెక్షన్ మీదనే కరెంటు వాడుకోవల్ల తెల్సిందా? ఇట్లా పనికిమాలిన ఆలోచనలు కట్టిపెట్టెయ్యి... అట్లయితే ఎవురూ మీటరు వేసుకోరు. వీధికొకరికి ఉంటే చాలు- వీధంతా హాయిగా ఆ ఒక్కమీటరుతోనే కరెంటు వాడుకుంటూ ఉంటారు." అన్నాడు ఆవేశంగా సింహాచలం.

సింహాచలాన్ని ఇంకా ఎక్కువ మాట్లాడిస్తే వాతావరణం మరీ భయంకరంగా మారిపోతుందని ఊరకుండి పోయింది భాగ్యమ్మ.

"ఏందో- వీడూ, వీనిమాటలూ ఎవురికీ అర్థమేకావు!" అంటూ గొణుగుతూఉంది తల్లి.

ఆ మరసటి రోజు బిల్లు చెల్లించాక. అప్పుడు ఫ్యూజ్ వేసి పోయారు కరెంటువాళ్లు.

సింహాచలం మాత్రం మీటరు మార్పించేందుకు చేసే ప్రయత్నాలు మానలేదు. అయినా మీటరు మారలేదు.

ఈలోగా రెండు నెలలు గడిచిపోయినాయి. మళ్లీ ఎనిమిది వందలరూపాయల కరెంటు బిల్లు వచ్చింది. నాలుగ్గదుల్లో ఉన్న నాలుగు బల్బులకీ, ఒక టీవీకి రెండు ఫ్యాన్లకీ అంతంత బిల్లు రావడంతో- నిజంగా భయపడిపోయినాడు సింహాచలం.

సింహాచలం ఈసారి సీరియస్సుగానే వెళ్లి విషయం వివ రించాడు కరెంటు అధికార్లకి... అయినా ఫలితం శూన్యం... కాల్చని కరెంటుకి డబ్బుకట్టాల్సి వచ్చినందుకు ఒకింత బాధపడ్డా- కడుతున్నది మన గవర్నమెంటుకే కదా అన్నదాంతో కొంత ఊరట చెందారు.

"చాలామంది మీటరు తిరక్కుండా అయస్కాంతం పెడ తారంట, మనమూ పెడదాం ఇట్ల ఎనిమిది నూర్లు బిల్లు వస్తుంటే ఎట్ల?" అంది భాగ్యమ్మ ఓ రోజు ఉదయం.

"అట్లచేయడం అవినీతే... అవినీతంటే నాకు అసహ్యం!" అన్నాడు సింహాచలం కటువుగానే.


"ఏంది అవినీతండీ! అవినీతంట అవినీతి! కాల్చని కరెంటుకి డబ్బు చెల్లించడం అవినీతి కాదా? అది మీకు అసహ్యంగా లేదా? కట్నం తీసుకొనే వాడిదే కాదు అవినీతి, ఇచ్చేవాడిది కూడా అవినీతే- అని ఎన్నోసార్లు నువ్వే కదా అంటూ ఉంటావు. అంది భాగ్యమ్మ తన అక్కసుని కనబడనీయకుండా.

"ఏమో, గవర్నమెంటు చట్టాల విషయంలో కొన్నిసడ లింపులు ఉండల్లని అనుకుంటాను. మనం అవినీతికి పాల్పడకూడదబ్బా! అన్నాడు సింహాచలం.

ఈ మొండి మనిషితో వాదించడం ఎందుకులే అని వంటింట్లోకి వెళ్లిపోయింది భాగ్యమ్మ.

ఇది జరిగికూడా అప్పడే రెండునెలలు దాటిపోయింది-

ఇంటిముందు ఆటో ఆగిన చప్పుడయితే తలెత్తిచూశాడు సింహాచలం.




ఆటోలోంచి తవతల్లీ, భాగ్యమ్మ, సుధాకరూ దిగారు.

ఇంట్లోకి అడుగు పెడుతున్నట్లే- "ఏం అట్లున్నావూ?" అంది భాగ్యమ్మ.

"ఎట్లున్నాను...?" అంటూ ఎదురుప్రశ్నవేశాడు సింహాచలం.

"మొగమంతా పాలిపోయి ఉంది." అంటూ అతని జుత్తులోకి వేళ్లుజొనిపి ప్రేమగా అంది భాగ్యమ్మ.

"ఏమయిందిరా సుస్తీగా ఉందా?" అంది అమ్మ అప్పుడే లోపలికి అడుగు పెడుతూ.

"ఏం లేదమ్మా! మీదంతా విచిత్రం!" అన్నాడు తను, నవ్వాలని ప్రయత్నిస్తూ.

"నాకు అట్లే అనిపిస్తాఉంది నాన్నా!" అన్నాడు సుధాకరు.

"రేయ్! నోర్మూసుకొని పో! అంతా బెడ్ పేషంటుని పరామర్శించినట్లుమాట్లాడతా ఉండారు!" మధ్యాన్నం అర్థరోజూ ఆఫీసుకి సెలవు పెట్టి ఆ కరెంటు ఆఫీసు కాడికి పొయ్యొస్తిని... ఏమంటే కొంచెం గొడవపడి వస్తిని. ఏం జేసేది? ఊరికే అట్ల తిప్పించుకుంటా ఉంటే- అర్ధరోజు సెలవు వేస్టయిపోయె... ఇదే ఆలోచించుకుంటా ఉంటే మీరు వస్తిరి- అంతే!" అంటూ భార్యనుద్దేశించి అన్నాడు.

"ఏమండీ నీకో శుభవార్త! బిల్లువచ్చింది- కరెంటు బిల్లు! చూళ్లేదా? ఇద్దో టీవీ మీదే ఉంది" అంటూనే బిల్లు తీసి ఇచ్చింది భాగ్యమ్మ.

"ఆఁ... కరెంటు బిల్లా?" అంటూ షాక్ తిన్నంతగా అరిచాడు సింహాచలం.

"ఎందుకట్ల అరుస్తావు? నువ్వు ఊహించినంత భయంక రంగా లేదు బిల్లు- రెండునెలలకీ కలిసి ఎనభై రూపాయలే!"

బిల్లుని చూడగానే సింహాచలం ముఖం పొద్దు తిరుగుడు

పుష్పాంత విప్పుకుంది- "అవునే- హా రంబిట్ పాజిబుల్...." అన్నాడు.

"ఏమో, ఐడోంట్ నో!" అంటూ వంటింట్లోకి వెళ్లింది భాగ్యమ్మ.

నిజంగా నమ్మలేకుండా ఉన్నాడు సింహాచలం.... ఏమైనా కరెంటు పాముల్లాంతే! అవి ఎప్పుడు సరిగ్గా పనిచేస్తాయో ఎప్పుడు లేదో ఎవరికీ తెలీదు. ఈ విషయం తెలీక ఊరికే ఆ కరెంటు వాళ్లతో గొడవ పెట్టుకున్నాడు తమ- మీటరు మార్చమని. బుర్రంతా చెడగొట్టుకున్నాడు. అర్థరోజు సెలవు కూడా వృథాచేసుకున్నాడు. ఇంక తను ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు. వెంటనే ఆనందంగా సిగరెట్టుని వెలిగించుకుని తృప్తిగా పొగపీల్చి విలాసంగా గాల్లోకి ఊదాడు. కాసేపటికి బట్టలు మార్చుకుని బజార్లోకి వెళ్లాడు సింహాచలం రాత్రి ఎనిమిది గంటలకి ఇల్లు చేరుకున్నాడు. బట్టలు విప్పుతూ తనని ఈ రోజు ఆనందింపజేసిన మీటరు వైపు యాంత్రికంగా చూశాడు.

అంతే, అతని చూపులు అక్కడే అతుక్కుపోయాయి....

కెవ్వుమని కేకపెట్టబోయి, తమాయించుకుని 'ఏమేవ్!' అంటూ అరిచాడు.

"ఏమండీ!" అంది లోపల్నించి భాగ్యమ్మ.

"ముందిట్లరావే!" అన్నాడు మరింత గట్టిగా.

"ఏమయిందీ?" అంటూ వచ్చింది భాగ్యమ్మ.

"ఎవరాపని చేసింది?" అన్నాడు.

"ఏ పనీ?"

"మీటరుకి వైరు పెట్టడం! అంటూ మీటర్ని చూపించాడు. మీటరు కింద ఆకుపచ్చటివైరు మీటరు చక్రాన్ని నిలబెట్టేందుకు దండలా వేలాడుతోంది."

"అంతేకదా! సుధాకరు పెట్టినాడులే!" అందామె- అతితేలిగ్గానే.

"ఏడీవాడు? రేయ్ సుధాకరూ!" అంటూ కేకపెట్టాడు సింహాచలం.

"వాడు మిద్దెమీద చదువుకుంటున్నాడులేండి- వాన్నెందుకు డిస్టర్బ్ చేస్తారు" అంది భాగ్యమ్మ- మెల్లగా.

"అది కాదే ఇది ఎంత అవినీతో తెలుసా?" అన్నాడు- ఉపోద్ఘాతంగా

"తెలుసు- మంచి మీటరు వేయించుకొనేదానికి, రోజూ ఆ కరెంటు ఆఫీసు చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంలో గొప్ప నీతి ఉందా? రెండు నెలల్నించీ రాత్రిపూట ఈ పనిచేస్తుండబట్టే, మనకి అసలైన కరెంటు బిల్లు వచ్చింది"

"ఎవరయినా మీటరు రీడింగు, ఉద్యోగి వస్తే- ఇది చూస్తే- ఇంకేమయినా ఉందా? కేసు బుక్ చేస్తాడు- కోర్టుకీడుస్తాడు." అంటూ మండిపడ్డాడు సింహాచలం.

"మన్నుగీన అట్లా ఉద్యోగంజేస్తే ఆపనే తీరా చేసేదీ- వీళ్లు నా వాళ్లూ, ఇది నా ఇల్లూ అని కూడా ఉండదు నీకి... నీదంతా ఏందో పోది.... అప్పుడే నెలకిందటే ఆ మీటరు చూసే ఆయప్ప వచ్చి ఆవైరుని చూసి కేసు రాస్తానని... యాభై రూపాయల కాగితము చేతిలో పెడతానే నవుతా ఎళ్లిపాయె! ఈ యవ్వారంతా ఇనోదము... కాల్చని కరెంటుకి దుడ్లు కట్టే దినీతీ... ఎక్కువ తిరిగే చక్రాన్ని నిలబెట్టేది అవినీతి. ఏందో అర్థమేకాదప్పా నీకత!" అంటూ ఉంది తల్లి వంటింట్లోంచి.

తలపట్టుకొని - మీటర్ని నిలబెట్టేసి ఆకుపచ్చటివైరుని చూస్తూ ఉండిపోయినాడు సింహాచలం. ●

